# దేవత

## జంపన పెద్దిరాజు

అయాన్స్ పార్టికల్స్ దొరికే సరికి వెధవ ఎక్స్‌పెరిమెంట్ ఐదు గంటలు పట్టింది. చిరాగ్గా చేతులు కడుక్కొని సిగరెట్ వెలిగించి న్యూక్లియర్ లాబ్‌లోంచి బయటపడ్డాను. మసక మసగ్గా వున్న వెన్నెల్లో ఎదురుగా వున్న వెంకటేశ్వరా ప్రేయర్ హాల్ గోతులోపడ్డ ఏనుగులా వుంది. మబ్బుచాటున పరిగెత్తున్న చంద్రుణ్ణి చూసేసరికి న్యూక్లియర్ ఫిజిక్స్‌లాబ్ వైపు సగర్వంగా చూశాను. అణుయుగంలో మనిషికి సర్వసుఖాలు అందించే అమృతమూర్తిలా కనిపించింది.

టక్ సరిచేసుకొని నెమ్మదిగా ప్రేయర్ హాలును, లాన్ను చీలుస్తున్న రోడ్డుమీదికి వచ్చి నిలబడి వాచ్ చూసుకొనే సరికి సరిగ్గా ఒంటిగంట.

రీసెర్చిలో చేరిన తర్వాత ఆ టైములో ఆ కార్నర్‌లో ఆడమనిషిని చూట్టం అదే మొదటిసారి. యూనివర్సిటీ కాంపస్‌లో రాత్రుళ్ళు అలా తిరుగుతారని వినటంచేత, ఆమె అక్కడ ఎందుకు నిలబడిందన్న అనుమానం నాకు రాలేదు. ఆమె ఆ కార్నర్‌లో నిలబడి నా వైపే చూస్తోంది. నాకాళ్ళు నెమ్మదిగా ఆ కార్నర్‌కు చేరాయి.

"టైమేటయింది" -ఆమె నవ్వింది. ఆ గొంతులో అనాగరికత, ఆ నవ్వులో ఏవో ఎండిపోయిన పువ్వులు.

"ఒంటి గంట" - అంటూ నెమ్మదిగా ఆమె ముందుకుంచే అడుగు వేశాను. టైము చెప్పినప్పుడు నాకు తెలియకుండానే నవ్వాను.

"టైము వేస్టయిపోతన్నాది-ఒత్తావేటి" ఆ మాటకు నవ్వొచ్చింది. తెలియకుండా నా నడకలో మార్పొచ్చింది. అటూ ఇటూ తచ్చాడుతున్నాను. చేపపడబోతున్న గాలం చేతిలోవున్న జాల

రిలా ఆమెకళ్ళల్లో ఓ రకమైనఆత్రుత - నిండుకుండలా అంది.

"పన్నెదు-పదినిమసాలేగా - అలా చెట్లల్లోకి పోదాం - మల్లా ఏరన్నా ఒత్తారు" ఆమె అందంగా ఒళ్ళు విరుచుకుంది.

చెట్లు. చీకటి. పసిరిగ పాములుండొచ్చు. అయినా నాకు భయమనిపించలేదు. కాని జేబు గుర్తు చేసుకొనేసరికి చిన్న సమస్య తగిలింది. చిల్లర లేదు. బాక్‌పాకెట్‌లో పొద్దున్నే నాన్న పంపించిన రెండూ వందరూపాయలనోట్లే. చిల్లర సమస్యతో సరదా తీర్చుకోటానికి చిల్లర లేదు. కొంచెం తటపటాయిస్తున్నాను.

"ఆలోసించకు, మీ ఆడోళ్ళకు తీసిపోను" అంది. అవకాశం జారిపోతుందన్న భయంతో. ఆకాశంవంక నా వంక గోముగా చూసింది.

కొంచెం లోపల సిగ్గుపడినా పైకి నవ్వుతూ నిర్మొహమాటంగా చెప్పగలిగాను. "డబ్బుల్లేవు" అని.

"బలే సరసమాడతన్నావే" చెట్లసందునుంచి పడుతున్న వెన్నెల కిరణంతో ఆమె నా కంటె చాల పెద్దదిగా కన్పించింది.

"సరసంకాదు. నిజం చెబుతున్నా. లేవు. కావాలంటే రేపి దె టైముకు ఇక్కడకు రా. తప్పకుండా ఇస్తాను."

"స-పణ్ణాది." అంటూ మూతి విరిచి మెయినురోడ్డుకేసి నడవబోయింది. నాలో క్యూరియాసిటీ హెచ్చింది. ఆమె కౌగిలిలో ఇమిడి బోల్డంత విషయసేకరణ చేయాలన్న ఉత్సాహం, ఆమెపై సహజంగా అందరికీ ఉండేలాటి తక్కువ అభిప్రాయం (అదే జంతుతత్వం) నా చే ఆ పని చేయించింది.

ఒక్కవుదుటనవెళ్ళి ఆమె పక్షం మీద చెయ్యివేసి ఆపాను. చెయ్యి అలాగేవుంచి నవ్వాను. ఆమె వెంటనే విసిరి కొట్టింది.

"నీలాటోళ్ళి సాలామందిని చూశా- రూముకు తీస్కెళ్ళి ఎగ్గొట్టి ఏడిపించిన మా బాబుల్నికూడ ఎరుగుదును — ఏటనుకుంటున్నావో! అనుకోని సమాధానానికి ఆశ్చర్యపడి అవమానపడుతూ పలకలేని గొంతుకుతో అన్నాను. "పో వే నువ్వ నాకక్కరలేదు — జస్ట్ నీతో మాట్లాడాలి."

"మా రాజుకదా మారాజు. మాటాడతాడట మాటాడతాడు.

రూపాయి డబ్బులిచ్చుకోలేని మారాజుకూడా ముచ్చటే. సొంత పెళ్ళాంననుకున్నావా నాకేం పట్లేదనుకున్నావా- ఏటి - నీతో కూసుంటానికి" చెప్పుతో కొట్టినట్టు మాటాడి వెళ్ళిపోతోంది.

నేను తేరుకొనీ తేరుకోనటంలో "సరే. రేపు ఇదే టైముకి రా. డబ్బులట్టుకొస్తాను" అన్నాను ఏమీఅనలేక.



"అలాగను. అందం వున్నాది. టైమ్ వేస్టవుతున్నాది. వెళ్లిపోతునా ఏంటి ఆ కోరిక తీరిపోతాదే" అంది వెళ్ళిపోతూ.

చెల్లిమధ్య నిద్రపోతున్న చీకటిలా మనసంతా మొద్దుబారిపోయింది. టేప్ ఎయిర్ హాలిక్ చేసే చప్పుడులా గుండె దడదడ లాడుతోంది. నాగార్జునహోస్టలు తెరుపుగా ఉన్నలైటు దూరంగా నవ్వుతోంది.

తర్వాత ఇరవై నాలుగు గంటలు ఇరవై నాలుగు జన్మలెత్తినట్లనిపించింది. మర్నాడు అదే కౌన్సర్లో ఆమె నిల్చుంది.

చేతులు వెనక్కి పెట్టుకొని మామూలుగా ఆమె దగ్గరకు వెళ్ళాను. రెండు చీరెలు, వంద రూపాయల కాగితం ఆమె చేతిలో పెట్టాను. రెప్ప వాల్చకుండా ఒక్క క్షణం నా వంక అలా చూసి—"ఏటిది? నిన్న రాలేదని ఇయ్యాల అవమానిత్తన్నావా" అంది.

"కాదు. నేనే నిన్ను అవమానించాను." నా మాటకు ఆమె తెల్లబోయి చూసింది. ఆ చూపులో నాకు కావలసింది దొరికింది. నా మనసు తుడిచిన అద్దంలా అనిపించింది. గబుక్కున ఆమెను చేతుల్లోకి తీసుకొని వొంగి పెదవులపై ముద్దుపెట్టుకొని వెనక్కి తిరిగి చూడకుండా రూముకొచ్చి తలుపు వేసుకొన్నాను. వచ్చేటప్పుడు ఆమె కళ్ళల్లో ఆదోరకమైన ఆర్ద్రత కనిపించింది. కొంచెం కొంచెం [illegible]స్తున్న కన్నీళ్ళు కూడా కనిపించాయి. వాటితో మనస్సుపై మాలిన్యం కడిగేసినట్టయింది.

* * *

మర్నాడు డిపార్టుమెంటుకెళ్ళే సరికి వాచ్‌మణ్ణి గురించి ఘనంగా చెప్పుకొంటున్నారు. ఆ కార్నర్‌లో ఎవరో చీర, డబ్బు వదిలేస్తే వాచ్‌మణ్ జాగ్రత్తగా డిపార్టుమెంటు కందించాడట. అదే కార్నర్ ప్రేయర్ హాల్‌కి ఫిజిక్స్‌లాబ్‌కి మధ్య.

చంద్రుణ్ణీ, దేవుణ్ణీ చూపిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రెండు శక్తుల మధ్య (ఫిజిక్స్ లాబ్, ప్రేయర్ హాల్) ఈ ఇరవయ్యో శతాబ్దంలో ఆమె ఇంకా అలా కూటి కోసం నిలబడటం చూస్తే ఎవరికైనా కథ వ్రాయాలనిపించదూ?

—రచయిత.

* * *

---

* షష్టిపూర్తి చేసుకున్న రాంగారావు పదహారేళ్ళ మనవడి బలవంతంమీద సినిమాకని బస్తీకి వచ్చారు. బస్సు దిగగానే — శనివారం కావటం చేత, హోటల్లోనే మంచి మాట చేసేసుకుని బయట నిలబడి, నగరంలోని సినిమాలు ఏమిటీ? — దేన్ని ప్రోత్సహించాలీ, అని వున్న బోర్డులన్నీ పరిశీలనగా చూస్తున్నాడు. మూడు నాలుగింటిని పరీక్షించిన తాతగారు —

"ఏంట్రా ఈపద్మశ్రీ రామారావు పక్కనా, నాగేశ్వరరావు పక్కనా కూడా నటిస్తోంది?" అని ఆశ్చర్యపోయాడు.